సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 9 । నవంబర్ । 2024



'పచ్చ ముఠా' మట్టి మాఫియా

పోలవరం కాలువ గట్టుపై పచ్చ ముఠా పేట్రేగిపోతోంది. విలువైన గ్రావెల్ మట్టిని అక్రమంగా తవ్వి తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. 8లో ▸



పందేలకూ సిండికేట్

బరిలో ఢీ కొట్టేందుకు పందెం పుంజులు సిద్ధమవుతున్నాయి. సంక్రాంతి బరుల నిర్వహణకు సిండికేట్‌గా ఏర్పడి పందెంరాయుళ్లు ముందుకు సాగుతున్నారు. 8లో ▸



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రానికి శుక్రవారం రాత్రి పాదయాత్ర భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మంది పాదయాత్రగా తరలివచ్చారు. 8లో ▸

జగన్ వెంటే.. జెడ్పీటీసీలంతా..

- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీటీసీల సమష్టి పోరు
- జెడ్పీ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డీఎన్నార్, ముదునూరి



హాజరైన జెడ్పీటీసీలు



ఏలూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు డీఎన్నార్, ముదునూరి, సమన్వయకర్తలు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జెడ్పీటీసీల ప్రయాణం అని.. రాష్ట్రంలో పేదలకు అండగా రాబోయే కాలంలో మరింత మెరుగైన రీతిలో సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పార్టీ విధానాలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న తీరుపై జెడ్పీటీసీలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల్ అన్నారు. ఏలూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల జెడ్పీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ తీరుపై ఆగ్రహం

ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు 40 మందికి పైగా హాజరయ్యారు. వీరంతా ఈనెల 11న ఏలూరులో జరిగే జిల్లాపరిషత్ సర్వసభ్య అత్యవసర సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ జెండా, అజెండా, పార్టీ గుర్తుపైనే తామంతా విజయం సాధించామనీ, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటూ.. పార్టీ కోసం పోరాడతామని తీర్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీకి పదవిని కట్టబెడితే కనీసం జెడ్పీటీసీలకు సమాచారం ఇవ్వకుండా, ఏకపక్షంగా మరో పార్టీ తీర్థం పుచ్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీపై అనర్హత వేటుకు న్యాయపరమైన పోరాటం చేస్తామని తీర్మానించారు.

ఫిరాయింపులు సరికాదు : పార్టీ జిల్లా అధ్యక్షులు డీఎన్నార్, ముదునూరి, చెల్లుబోయిన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో అన్ని కులాలకు సముచిత స్థానం కల్పిస్తూ బీసీలకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. అధికారంలో లేకపోయినా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధికి కృషి చేయాల్సిన నాయకులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం సరికాదన్నారు. జెడ్పీటీసీలు ప్రత్యేక సమావేశంలో తమ డిమాండ్‌ను కలెక్టర్, జెడ్పీ సీఈఓ ముందు పెట్టాలనీ, దానిపై వెంటనే తీర్మానం చేయాలన్నారు. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి విజయాన్ని అందించిన ప్రజలకు సేవ చేయాల్సిన నాయకులు పక్కచూపులు చూడటం సమర్థనీయం కాదన్నారు. జెడ్పీటీసీలకు పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందనీ సమన్వయకర్తలు భరోసా ఇచ్చారు. సమావేశంలో ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, సమన్వయకర్తలు కొఠారు అబ్బయ్యచౌదరి (దెందులూరు), తెల్లం బాలరాజు (పోలవరం), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), తలారి వెంకట్రావు (కొవ్వూరు), కంభం విజయ రాజు (చింతలపూడి), మామిళ్లపల్లి జయప్రకాష్ (ఏలూరు), గుడాల గోపి (పాలకొల్లు) ఉన్నారు.

న్యూస్‌రీల్

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



ఆకివీడు ఏఈ కార్యాలయంలో బైఠాయించిన బాధితులు

ఆకివీడు: అయిభీమవరం రహదారిలో ఆక్రమణ బాధితులు తమ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు నిలుపుదల చేశారని స్థానిక ఏఈ కార్యాలయంలో శుక్రవారం రాత్రి బైఠాయించారు. తమ ఇళ్లకు కనెక్షన్ ఇచ్చేంత వరకూ కదిలేది లేదని భీష్మించారు. విద్యుత్ నిలుపుదలతో వృద్ధులు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. బాధితులు రాత్రి కార్యాలయంలోనే బైఠాయించిన చోటే నిద్రించారు.

ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు ఇద్దరిని బదిలీ చేస్తూ కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. రెవెన్యూ విభాగంపై ఆరోపణల నేపథ్యంలో గురువారం ఆమె ఆ విభాగంలో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, ఫైల్స్ నిర్ణీత గడువులో క్లియర్ చేయకపోవడం, సక్రమంగా విధులు నిర్వహించకపోవడం, గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం తదితర కారణాలను గుర్తించారు. దీంతో మెజిస్టీరియల్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఎస్‌కే షకీల్, కో–ఆర్డినేషన్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ కె.జీవన్‌కుమార్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ దివ్య స్మైలీని సస్పెండ్ చేశారు. అలాగే కో–ఆర్డినేషన్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ తేజను ఆచంట తహసీల్దార్ కార్యాలయానికి, మెజిస్టీరియల్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ యు.వెంకట్ కుమార్‌ను పెనుగొండ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు.

నిర్ణీత చార్జీలకే ఇసుక వాహనాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఇసుక వినియోగదారుడు నేరుగా ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఫోన్ చేసి నిర్ణీత ధరలకే ఇసుక రవాణా వాహనాలను పొందవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఇసుక కొరత దృష్ట్యా సులువుగా ఇసుకను పొందేందుకు రీచ్‌లను అందుబాటులో ఉంచడంతోపాటు నిర్ణీత ధరలకే రవాణా వాహనాలను ఏర్పాటు చేయడానికి జిల్లా యంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. వినియోగదారులు కలెక్టరేట్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్ నంబర్లు 93914 45753, 86682 91997, 81869 39223, 95501 75144కు ఫోన్ చేసి ఇసుక రవాణాకు వాహనాన్ని పొందవచ్చన్నారు. వినియోగదారుడు నేరుగా రీచ్‌కు వెళ్లి ఆధార్ కార్డు ద్వారా ఉచిత ఇసుకను లోడింగ్ చార్జీలతో పొందవచ్చన్నారు.

ప్రత్యేకాధికారుల పదవీ కాలం పొడిగింపు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రత్యేకాధికారిగా ప్రస్తుతం గూడెం ఆర్డీఓ కతీబ్ కౌసర్ భానో వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకాధికారి పదవీ కాలం వాస్తవానికి ఈనెల 5వ తేదీతో ముగిసింది. రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, రాజాం, బాపట్ల, గూడూరు, తాడేపల్లిగూడెం పురపాలక సంఘాల ప్రత్యేకాధికారుల పదవీ కాలాన్ని వచ్చే ఏడాది మే 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ తేదీలోపు లేదా ఆయా పురపాలక సంఘాలకు కొత్త పాలకవర్గం వచ్చే వరకూ ప్రత్యేకాధికారులు కొనసాగుతారు.

ఎంటీఎస్ టీచర్ల సమస్యలపై వినతి



డీఈఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్)లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎంటీఎస్ టీచర్ల సంఘం నాయకులు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మను కోరారు. శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్దుబాటులో తమను నిబంధనలు మీరి 100 కిలోమీటర్ల దూరానికి బదిలీ చేశారని అన్నారు. అలాగే పదవీ విరమణ వయసును పెంచేలా ప్రభుత్వంతో సంప్రదింపులు చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ తదితరులు ఉన్నారు.

ర్యాంపుల్లో లోకల్ రాజ్యం

పశ్చిమలో ఇసుక కష్టాలు

- ఎన్‌జీటీ అనుమతులు రాక జిల్లాలో తెరుచుకోని ర్యాంపులు
- తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ర్యాంపులే దిక్కు
- అక్కడి రీచ్‌లలో స్థానిక కూటమి నాయకుల పెత్తనం
- ఉచితం మాటున కాసుల వేట
- లోకల్ ట్రాక్టర్లు, లారీలకే లోడింగ్
- పగలంతా నిల్వలు.. రాత్రిళ్లు అమ్మకాలు
- 'పశ్చిమ' వాహనాలకు ఒక్క ట్రిప్పు కూడా గగనం
- వెయిటింగ్, రవాణా చార్జీలతో అదనపు భారం



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గోపాలపురం ర్యాంపు వద్ద జాతీయ రహదారిపై బారులు తీరిన ట్రాక్టర్లు

సాక్షి, భీమవరం: వశిష్ట గోదావరిలో వరద నీరు లాగినా జిల్లావాసులను ఇసుక కష్టాలు వీడటం లేదు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) అనుమతులు రాక స్థానిక ర్యాంపులు తెరుచుకోవడం లేదు. పక్క జిల్లాల ర్యాంపుల్లో లోకల్ హవా నడుస్తుండటంతో జిల్లాకు చెందిన ట్రాక్టర్లు, లారీలకు రోజుకు ఒక ట్రిప్పు కూడా లోడవ్వడం గగనమవుతోంది. దీంతో వెయిటింగ్, రవాణా చార్జీల రూపంలో జిల్లా వాసులు అదనంగా నష్టపోవాల్సి వస్తోంది.

సీఆర్‌జెడ్ పరిధిలోకి..

జిల్లాలో సిద్ధాంతం 1, 2, కరుగోరుమిల్లి, కోడేరు, నడిపూడి 1, 2 ర్యాంపులు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, యలమంచిలిలంక, చించినాడ, మాధవాయిపాలెంలోని డీసిల్టేషన్ పాయింట్లు ద్వారా ఇసుక తవ్వకాలు జరిగేవి. సముద్రపు ఉప్పునీటి పోటు వలన ఈ రీచ్‌లు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలోకి వెళ్లడంతో నిర్మాణ పనులకు ఇక్కడి ఇసుక పనికి రాదని ర్యాంపులు తెరిచేందుకు ఎన్‌జీటీ అనుమతులు నిలిపివేసింది.

తీరని ఇసుక వెతలు

జిల్లా అవసరాల నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు, కొవ్వూరు మండలం ఔరంగబాద్ ర్యాంపులను ప్రభుత్వం కేటాయించినట్టు అధికారులు తెలిపారు. తీపర్రు జిల్లాకు చేరువగానే ఉన్నా ఔరంగబాద్ ర్యాంపు దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో రవాణా చార్జీల రూపంలో వినియోగదారులపై అదనపు భారం పడుతుందని లారీ యజమానులు అంటున్నారు. జిల్లాకు సమీపంగా ఉన్న నిడదవోలు మండలంలో ర్యాంపు కేటాయించినా కొంత భారం తగ్గేదని వారంటున్నారు. తీపర్రు ర్యాంపు వద్ద ఉచిత ఇసుక స్టాకు పెట్టే పని శుక్రవారం ప్రారంభమైందని ట్రాక్టర్లలో లోడింగ్‌కు మరో రెండు మూడు రోజుల సమయం పడుతుందని అక్కడి అధికారులు చెబుతున్నారు.

లోకల్ వాహనాలంటూ..

తూర్పుగోదావరి జిల్లాలోని తీపర్రు ర్యాంపు ఇంకా ప్రారంభం కాకపోవడంతో కొద్దిరోజులుగా పెండ్యాల, గోపాలపురం, జొన్నాడ తదితర ర్యాంపులకు ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. కాగా ఇసుక లోడింగ్‌లో ర్యాంపుల వద్ద అక్కడి లోకల్ కూటమి నాయకుల పెత్తనమే నడుస్తోందని జిల్లాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు అంటున్నారు.

క్యూ పద్ధతిని పాటించాలని ఎవరైనా వారి ట్రాక్టర్లను అడ్డుకుంటే లోకల్ బళ్లంటూ తమపై గుంపులుగా గొడవలకు దిగుతున్నారని వాపోతున్నారు. అక్కడి వారు రోజుకు పది వరకు ట్రిప్పులు వేస్తే తమకు ఒక ట్రిప్పు పడటం గగనమవుతోందని ఆవేదన చెందుతున్నారు. లారీలదీ ఇదే పరిస్థితి. గోపాలపురం ర్యాంపులో ట్రాక్టర్‌లో ఒక యూనిట్ ఇసుక లోడింగ్ నిమిత్తం రూ.500లు వసూలు చేస్తుండగా రవాణా, వెయిటింగ్ ఖర్చులతో కలిపి పాలకొల్లుకు రూ.4,000 వరకు, తణుకు ప్రాంతానికి రూ.3,000 వరకు ధరకు ఇసుకను చేరవేస్తున్నట్టు ట్రాక్టర్ డ్రైవర్ ఒకరు తెలిపారు.

> **వెయిటింగ్ చేసి ఖాళీగా..**
>
> 
>
> తీపర్రులో లోడింగ్ ఇంకా మొదలు పెట్టకపోవడంతో గోపాలపురం ర్యాంపు వద్దకు వచ్చాం. ఇక్కడ లోకల్ ట్రాక్టర్లకే లోడింగ్ చేస్తుండటంతో నిన్నంతా వెయిటింగ్ చేసి ఖాళీగా వెళ్లిపోయాం. ఈరోజు మళ్లీ వచ్చాం.
>
> – కె.సత్యనారాయణ, తణుకు, ట్రాక్టర్ డ్రైవర్

> **లోకల్ బళ్లకే లోడింగ్**
>
> 
>
> ర్యాంపుల వద్ద లోకల్ ఫీలింగ్ చూపిస్తున్నారు. వారి వాహనాల్లోనే ఇసుక లోడింగ్ చేసుకుంటున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వాహన డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఒక్కోసారి రోజుకు ఒక ట్రిప్పు కూడా పడకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.
>
> – రావూరి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు, పాలకొల్లు

కూటమి నేతల ఇష్టారాజ్యం

జిల్లాకు సమీపంలోని తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని పలు ర్యాంపులు తెరుచుకున్నాయి. జిల్లాలో రెండు యూనిట్ల నుంచి ఆరు యూనిట్ల సామర్థ్యం కలిగిన లారీలు 2,000 వరకు ఉండగా, ఒక యూనిట్ సామర్థ్యం కలిగిన ట్రాక్టర్లు 500 వరకు ఉన్నాయి. వీరంతా ఇసుక కోసం పక్క జిల్లాల్లోని ర్యాంపులకు వెళుతున్నారు. కాగా లోకల్ పేరిట కూటమి నాయకులు కాసుల వేట సాగిస్తున్నారు. ర్యాంపుల వద్ద లోకల్ బళ్లకే మొదటి ప్రాధాన్యత అంటూ క్యూలో ఉన్న నాన్‌లోకల్ లారీలు, ట్రాక్టర్లను తప్పించుకుని ముందుకు పోనిచ్చి తమ వాహనాల్లో ఇసుకను లోడింగ్ చేయించుకుంటున్నారు. పోలీసులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది.



గోపాలపురం సమీపంలో సిద్ధాంతం వంతెనకు సమీపంలో ఇసుక నిల్వలు

ఉచితం మాటున వ్యాపారం

ఉచిత ఇసుకను ట్రాక్టర్లలో తెచ్చి ఎక్కడికక్కడ స్టాకులు పెట్టి రాత్రి వేళల్లో లారీల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నరు. ఐదు యూనిట్ల లారీ పెనుగొండకు దాదాపు రూ.16 వేలు, పాలకొల్లుకు రూ.20 వేలు, నరసాపురానికి రూ.24 వేలు, భీమవరానికి రూ.28 వేలు, ఆకివీడుకు రూ.30 వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



తాడేపల్లిగూడెం 11వ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొమ్మలను తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను చెట్ల కొమ్మలు, పొదలు చుట్టేయడంపై 'సాక్షి'లో శుక్రవారం 'అల్లేసినా.. పట్టించుకోరా!' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. పట్టణంలోని మహాలక్ష్మి నగర్ రోడ్డు నంబర్ 2, 3 మధ్య శివారు ప్రాంతాలు, 11వ వార్డు, సుబ్బారావుపేట ఏడో వార్డు స్కేటింగ్ పార్కు వద్ద, 5వ వార్డు కోదండ రామాలయం వద్ద తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పొదలు, చెట్ల కొమ్మలను తొలగించారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): మాతాశిశు మరణాలను నూరుశాతం నిరోధించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాతాశిశు మరణాల నివారణ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలు, సంతాన సాఫల్య కేంద్రాలు తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. గర్భస్రావం కేసులను ఆడిట్ చేసి పూర్తిస్థాయిలో నివేదికలు ఇవ్వాలన్నారు. ఆడపిల్లలు నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి అవగాహన కల్పించాలన్నారు. సంతాన సాఫల్య కేంద్రాల్లో తరచుగా తనిఖీలు చేసి, రికార్డులను అధ్యయనం చేయాలన్నారు. ఏఎస్పీ వి.భీమారావు, డీఎంహెచ్‌ఓ డా.డి.మహేశ్వరరావు, డీసీహెచ్ పి.సూర్యనారాయణ, జిల్లా ఐసీడీఎస్ అధికారి బి.సుజాతా రాణి, వైద్యాధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఓటర్ల జాబితా సవరణ శిబిరాలు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఈనెల 9,10, 23,24 తేదీల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఆర్వో వి.విశ్వేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, అర్హులు దరఖాస్తులు అందించవచ్చన్నా రు. ఓటర్ల నమోదు అధికారులు, తహసీల్దార్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు.

సమగ్ర ప్రణాళికతో సమస్యల పరిష్కారం

ఏలూరు(మెట్రో): సమగ్ర ప్రణాళికలతో సమస్యలు పరిష్కరించవచ్చని, 2025–26కి సమగ్ర ప్రణాళికలు తయారుచేయాల్సిన బాధ్యత స్థానిక ప్రభుత్వాలదేనని ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ జాయింట్ డైరెక్టర్ జి.రమణ అన్నారు. శుక్రవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లాపరిషత్‌లు సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మహిళలకు జీవనోపాధి మార్గాలు చూపాలన్నారు. ప్రజా ప్రణాళికా రచనలో అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలనీ, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రజా ప్రణాళికపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈఓ కె.భీమేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్, డీపీఆర్సీ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఎల్‌డీఓలు, ఉమ్మడి జిల్లాలోని డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్ జేడీ రమణ

11న జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక సమావేశాన్ని ఈనెల 11న ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ఏలూరులోని జిల్లా ప్రజాపరిషత్ సమావేశపు హాలులో సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో డీఎన్నార్ కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, అంతర్ కళాశాలల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు, యూనివర్సిటీ సెలక్షన్స్ పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో రాజమండ్రి ప్రభుత్వ కళాశాల, తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల, ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.రమేష్ తెలిపారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, సీపీడీసీ సెక్రటరీ గాదె జనార్ధన గుప్తా, గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ నతానియేల్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్‌లు బహుమతులు అందజేశారు. యూనివర్సిటీ బ్యాడ్మింటన్ సెలెక్షన్స్‌కు అంజనీదేవి, సాయి రత్న, రేణుశ్రీ, నాగదుర్గా భవానీ, యమునా పద్మావతి ఎంపికవ్వగా స్టాండ్ బై ప్లేయర్లుగా నాగలక్ష్మి, శ్రేయలను ఎంపికచేశారు.

తెలంగాణ మద్యం పట్టివేత



తెలంగాణ మద్యం కలిగిఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

బుట్టాయగూడెం : జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలో 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. సుంకం చెల్లించని తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 మద్యం బాటిల్స్‌ను ఒక వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గ్రామంలో సుంకం చెల్లించని ఏపీకి చెందిన మరో 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

రైల్వే విద్యుత్ స్తంభం నుంచి పడి వ్యక్తి మృతి



అత్తిలి రైల్వేస్టేషన్‌లో విద్యుత్ పోల్ ఎక్కిన వ్యక్తి

అత్తిలి: అత్తిలి రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్‌పై ఉన్న విద్యుత్ పోల్ ఎక్కి కొన్ని గంటల పాటు హల్‌చల్ చేశాడు. చివరకు అదుపు తప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ వ్యక్తి తమిళం మాట్లాడటంతో తమిళం వచ్చిన వ్యక్తి అతనితో మాట్లాడి కిందకి దిగాలని కోరాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి నిచ్చెన వేసి కిందకు రావాలని పలు మార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ దిగలేదు. రాత్రి సమయంలో అదుపుతప్పి పట్టాలు పక్కన ఉన్న కంకర రాళ్లపై పడిపోవడంతో మృతి చెందాడు. రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

‘పచ్చ ముఠా’ మట్టి మాఫియా

- పోలవరం కాలువ గట్టుపై అక్రమాలు
- కాలువ గట్టును కొల్లగొట్టి జోరుగా విక్రయాలు
- వివిధ ప్రాంతాలకు టిప్పర్లలో తరలిపోతున్న గ్రావెల్ మట్టి

ద్వారకాతిరుమల: పోలవరం కాలువ గట్టుపై పచ్చ ముఠా పేట్రేగిపోతోంది. విలువైన గ్రావెల్ మట్టిని అక్రమంగా తవ్వి తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. గోపాలపురం నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో కొందరు సాగిస్తున్న ఈ దందా రోజురోజుకు ఉధృతమవుతోంది. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురం, పరిసర ప్రాంతాల్లోని పోలవరం కుడి కాలువ గట్టుపై గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలు గత కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రస్తుతం కాలువకు రెండు పక్కల గట్లపై పొక్లెయిన్లు పెట్టి, రాత్రీ పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఈ తవ్వకాలు జరుపుతున్నారు. టిప్పర్ల రాకపోకలు జరిగే సమయంలో గట్టుపై మట్టి పైకి లేచి, టిప్పర్ డ్రైవర్లకు ఇబ్బంది కలుగుతుండటంతో, ఒక వాటర్ ట్యాంకర్ ద్వారా గట్టును తడుపుతున్నారు. నిత్యం ఇక్కడి నుంచి సుమారు 100 టిప్పర్లకు పైగా మట్టి బయటకు తరలిపోతోంది. ఒక్కో టిప్పర్ మట్టిని దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.11 వేలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ కాలువ మట్టి పాలసానిపల్లి, ఏలూరు, భీమవరం పరిసర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిపోతోంది.



లైన్ గోపాలపురం పరిధిలో పోలవరం కుడి కాలువ గట్టును తవ్వుతున్న దృశ్యం



ఎం.నాగులపల్లి వద్ద గట్టుపై తవ్వకాల కోసం సిద్ధంగా ఉంచిన పొక్లెయిన్

అనుమతులు ఉన్నాయంటూ దందా..

తవ్విన మట్టిని మరో ప్రాంతానికి తరలించాలంటే కచ్చితంగా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురంలో తవ్వకాలు జరుపుతున్న పచ్చ నేతల్లో ఒకరు సుమారు 5 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు పొందారు. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు పొందకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేంటని స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే మాకు అనుమతులు ఉన్నాయంటూ తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురంకు చెందిన ఆయన అనుచరులు ఈ దందాకు పాల్పడుతున్నట్టు చెబుతున్నారు.



మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతంలో లోడింగ్‌కు సిద్ధంగా ఉంచిన టిప్పర్.

తవ్వకాల వైపు కన్నెత్తి చూడని అధికారులు..

పట్టపగలు అక్రమ తవ్వకాలు సాగుతున్నా ఆ వైపు అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. అనుమతులు ఉన్నాయి మీకెందుకు రిస్క్.. మీ పని మీరు చూసుకోండి అని అధికారులు చెబుతున్నారట. అక్రమార్కులకు అధికారులు ఇలా కొమ్ముకాయడం దారుణమని పలువురు అంటున్నారు. ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో, అది కూడా మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నారని ధ్వజమెత్తుతున్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఇవి కనబడవా..

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ఐఎస్ జగన్నాథపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని, అక్కడ జరిగిన గ్రావెల్ తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పోలవరం కాలువ గట్టుపై జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు ఆయనకు కనబడటం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలు

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగినట్లు రెవెన్యూ, గనుల శాఖ అధికారులు నిర్ధారించారు. బెకెమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్ సంస్థ 20.95 ఎకరాల్లో ఏ విధమైన అనుమతులు లేకుండా 6 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లు తేల్చారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఈనెల 1న ఐఎస్ జగన్నాధపురంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో కొండ కింద మైనింగ్ జరిగినట్టు గుర్తించారు. తవ్వకాలు నిబంధనల ప్రకారమే జరిగాయా, తవ్వినవారు ఎవరు అనే అంశాలపై విచారణ జరిపి, వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. దీనిపై రెవిన్యూ, గనుల శాఖల అధికారులు విచారణ జరపగా.. నివేదికను కలెక్టర్ పవన్ కల్యాణ్ కార్యాలయానికి సమర్పించారు. ఐఎస్ జగన్నాథపురంలోని సర్వే నెంబర్ 425 లో 6.18 ఎకరాల్లో 74,875 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వుకునేందుకు అనుమతి పొందారు. అందులో ఎలాంటి తవ్వకాలు జరపలేదు. ఆ తరువాత అదే సర్వే నెంబర్‌లోని మరో ప్రాంతంలో 1.48 ఎకరాల్లో 36,107 క్యూబిక్ మీటర్లు తవ్వుకునేందుకు అనుమతి పొంది, 33,637 క్యూబిక్ మీటర్లు తవ్వుకున్నారు. అదే సర్వే నెంబర్‌లో మరో చోట ఎలాంటి అనుమతులు లేకుండా 20.95 ఎకరాల్లో 6,15,683 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ మట్టి తవ్వకాలు జరిపినట్లు తేల్చారు. బెకెమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు నోటీసులు జారీ చేస్తామని, దీనికి బాధ్యులైన రెవిన్యూ, గనుల శాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్టు కలెక్టర్ నివేదికలో పేర్కొన్నారు.

క్రీడల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

భీమవరం : క్రీడల్లో సాధన ద్వారా మానసిక వికాసం సాధించడమేగాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని శ్రీ చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో 68వ ఆంధ్రప్రదేశ్ అండర్–14, అండర్–17, అండర్–19 అంతర్ జిల్లాల మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్ పోటీలు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అంతర్ జిల్లాల స్థాయి పోటీలను వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్ క్రీడలను తిలకించారు. 3 జిల్లాలకు చెందిన 650 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఇ.నారాయణ, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహారాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు తదితరులు పాల్గొన్నారు.



అంతర్ జిల్లాల మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి



మాల్కంబ్‌లో క్రీడాకారుడి సాహసం



మాల్కంబ్‌లో క్రీడాకారుల ప్రదర్శన

వీఆర్వోలకు ఇతర పనులు కేటాయించొద్దు

పెనుమంట్ర: గ్రామ రెవెన్యూ అధికారులకు ఇతర డిపార్టుమెంట్ పనులు కేటాయించవద్దని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ఈ ఆదేశాలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు విజ్ఞప్తి చేసారు. పెన్షన్ పంపిణీ, రైసు మిల్లుల వద్ద కస్టోడియన్ ఆఫీసర్లుగా, ఇసుక రీచ్‌ల వద్ద డ్యూటీలు, రెగ్యులర్ రెవెన్యూ పనులు, కోర్టు వాయిదాలు ఇలా అన్ని పనులకు వీఆర్వోలను వాడుతున్నారన్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

ఉండి : ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన మహిళను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యండగండి గ్రామానికి చెందిన మహిళ తండ్రి ఇంటి వద్ద ఉంటుంది. ఇంటి పక్కనే వుండే తాడి యాకోబు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని సదరు మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్రాంతి పందేలకు సిండికేట్

- ముందుగానే సర్దుబాటు చేసుకుంటున్న కూటమి నేతలు
- గతంలో కంటే రెండింతలు ఎక్కువగా బరులు
- ఛత్తీస్‌గఢ్ నుంచి పందెం పుంజులు

కొయ్యలగూడెం : సంక్రాంతి బరిలో ఢీ కొట్టేందుకు పందెం పుంజులు సిద్ధమవుతున్నాయి. పందేలు నిర్వాహకులు పుంజులను తీసుకొచ్చి వాటికి ప్రత్యేక ఆహారం అందించడంతో పాటు.. శిక్షణ ఇస్తున్నారు. సంక్రాంతి బరుల నిర్వహణకు సిండికేట్‌గా ఏర్పడి పందెంరాయుళ్లు ముందుకు సాగుతున్నారు. ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో కూటమి నాయకులు ముందస్తు సర్దుబాటులో భాగంగా బరులకు సంబంధించి ఎవరెవరు సిండికేట్‌గా వ్యవహరించాలనే ప్రణాళికలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. పోటీల సమయంలో రచ్చకెక్కేకంటే ఇప్పుడు సర్దుబాటు చేసుకుంటున్నారు. ముఖ్య నేతలు సిండికేట్ లాబీయింగ్ కోసం మంతనాలు ప్రారంభించారు.

పందెంకోళ్లకు రాజభోగం

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన మేలు రకం పుంజులను పెంచుతున్నారు. కొయ్యలగూడెం మండలంలోని మారుమూల ప్రాంతంలో కోడిపుంజుల పెంపకానికి మకాం ఏర్పాటు చేశారు. ప్రతి మకాంలోనూ ఇద్దరు నుంచి నలుగురు మనుషులు పని చేస్తూ కోళ్లకు శిక్షణ ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు.



కొయ్యలగూడెం మండలంలోని మారుమూల ప్రాంతంలో పందెం పుంజుల శిక్షణ కేంద్రం



పుంజులకు తెగుళ్లు సోకకుండా మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

ఆరు నెలల వయసు ఉన్న మేలు రకం కోడి పుంజులను సంవత్సరం క్రితం రూ.50 వేలకు కొనుగోలు చేసి తీసుకొచ్చి పెంచుతున్నట్లు కొయ్యలగూడెంలో పుంజుల పెంపకం మకాం నిర్వహిస్తున్న నిర్వాహకుడు ఒకరు తెలిపారు. మకాం వద్దకు వైరస్ సోకుతుందనే కారణంతో మనుషులను సైతం రానివ్వకుండా వాటిని పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు తెగుళ్ల సోకకుండా పశు వైద్య సిబ్బంది సూచించిన మందులు వాడుతున్నారు.

పేకాట, గుండాటకు మంతనాలు

ప్రతి మకాంలో 40 నుంచి 50 పుంజులు పెంచుతున్నారు. ఒక్కో పుంజు రూ.2 లక్షల వరకూ పలుకుతుందని చెబుతున్నారు. ఇప్పటికే అడ్వాన్సులు చెల్లించిన వ్యక్తులు వాటిని పెంచే బాధ్యతను నిర్వాహకులకు అప్పగించి సంక్రాంతి సీజన్‌కు సిద్ధం చేస్తున్నారు. కోడిపందేల బరుల ముసుగులో సందట్లో సడేమియాలా పేకాట, కోతాట గుండాట, గ్యాంబ్లింగ్ వంటి జూద క్రీడల నిర్వాహకులతో లోపాయికారీ ఒప్పందాలకు దిగుతున్నారు.

తేమ శాతం పేరుతో కోత

ఉంగుటూరు : మద్దతు ధరకే ప్రతి గింజా కొంటాం అని ప్రభుత్వం చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన లేదని, దళారులు తేమ శాతం పేరుతో రూ.325కు పైగా కోత పెట్టడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం– ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నాయకులు ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం, నాచుగుంట, వెల్లమెల్లి గ్రామాల్లో పర్యటించి ధాన్యం రాశులు పరిశీలించారు. చినిగిన గోనెసంచులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం ప్రైవేటు వ్యాపారులకైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వమే చెప్పడంతో మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకొని అన్నదాతలను నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కల్లాల నుండి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ శాతం నిబంధన సడలించి పచ్చి ధాన్యాన్ని కూడా కొనాలని డిమాండ్ చేశారు. చినిగిన గోనె సంచులతో రైతులు నష్టపోతున్నారని నాణ్యమైన గోనె సంచులు ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పెరిగిన కనీస మద్దతు ధర రైతులకు గిట్టుబాటు కాదని ధాన్యానికి బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.



చినిగిన గోనె సంచులు చూపిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా



కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యానిమేటర్లు

కుక్కునూరు: యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించి బకాయిలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో యానిమేటర్లు కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తున్న యానిమేటర్లు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వారికి రావాల్సిన 6 నెలల వేతన బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు యానిమేటర్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని చెప్పిన నాయకులు అధికారం చేపట్టాక ఆ హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అత్యాచార యత్నంపై కేసు నమోదు

తణుకు: తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. కూరపాటి దిలీప్ కుమార్ మహిళ ఇంట్లోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారానికి యత్నించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కామినేని కళ్లతో చూసి మాట్లాడాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కై కలూరు: ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేపల రైతుగా అన్నీ తెలిసి చెప్పుడు మాటలు వింటున్నారని, ఆయన స్వయంగా కళ్లతో చూసి, చెవులతో విని నిజనిర్ధారణ చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు(డీఎన్నార్) హితవు పలికారు. ఇటీవల కైకలూరులో డీఎన్నార్ కుమారుడు భార్య పేరున చేస్తున్న 112 ఎకరాల లీజు చెరువు విషయంలో లీజు రైతులను భయపెట్టారనే నెపంతో డీఎన్నార్, కుమారులు వినయ్, శ్యామ్‌లపై కేసు నమోదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే కామినేని ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు భాస్కరరాజు, తానా ప్రసాద్, జంపన రామలింగరాజు తదితరులతో సీతారామఫంక్షన్ హాలులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. లీజు రైతులు, నాలుగు మండలాల నుంచి డీఎన్నార్ మద్దతుదారులు హాజరయ్యారు. డీఎన్నార్ మాట్లాడుతూ దాదాపు 80 మంది లీజు రైతులకు అగ్రిమెంట్లు రాసి సంతకాలు తీసుకోవడమే కాకుండా లీజు వారి బ్యాంకు ఖాతాలకు పంపుతున్నామన్నారు. బలవంతంగా లీజు రాయించుకున్నమనే ఆరోపణలు అవాస్తవమన్నారు. లీజు చెరువు మరమ్మతులు చేయడానికి రూ.2.12 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కారణంతో లీజు 5 సంవత్సరాలకు రూ.60 వేలు, మిగిలిన 5 సంవత్సరాలకు రూ.70 వేలుగా నిర్ణయించారన్నారు. దాదాపు 50 మంది కూటమి నేతలు చెరువు వద్దకు వెళ్లి మూడు సార్లు అక్రమంగా చేపలు పట్టుకోవడం ఎంత దుర్మార్గమే ఎమ్మెల్యే కామినేని ఆలోచించాలన్నారు. భయపెట్టి లీజు అగ్రిమెంట్లు చేయించుకోలేదని రైతులు చెప్పారు. పక్షులను తరమడానికి డమ్మి తుపాకీ ఉపయోగించడం ఇక్కడ సర్వసాధారణమన్నారు. రైతులపై తుపాకీ ఎక్కుపెట్టామని కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. డీఎన్నార్ కుమారుడు వినయ్ మాట్లాడుతూ స్థానిక పోలీసులు కూటమి నేతలకు లొంగి తాము ఫిర్యాదు చేసినా కేసు నమోదుకు ముందుకు రావడం లేదన్నారు. పోలీసుల తీరుపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని చట్టపరంగా ఎదుర్కొంటామని చెప్పారు.



కైకలూరులో ఆక్వా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన పాదయాత్ర భక్తులు



ఆలయ అనివేటి మండపంలో పాదయాత్ర భక్తులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రానికి శుక్రవారం రాత్రి పాదయాత్ర భక్తులు పోటెత్తారు. ప్రతి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి 3 వేల మంది వరకు భక్తులు పాదయాత్రగా ఆలయానికి వచ్చి, శనివారం ఉదయం స్వామివారిని దర్శించుకుంటారు. అయితే కార్తీకమాస పర్వదినాలను పురస్కరించుకుని ఈ శుక్రవారం రాజమండ్రి, నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, గణపవరం, భీమవరం, ఏలూరు, ఉయ్యూరు, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి 10 వేల మంది వరకు భక్తులు కాలినడకన క్షేత్రానికి చేరుకున్నారు. కొండపైన, కొండ దిగువన ఉన్న దేవస్థానం డార్మెటరీలు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. కాలినడక భక్తులందరికీ ఆలయ అధికారులు వకుళమాత నిత్యాన్నదాన భవనంలో స్వామివారి అన్నప్రసాదాన్ని, అలాగే శ్రీవారి ఉచిత దర్శనం టికెట్లను అందించారు.

ఏలూరులో కొనసాగుతున్న తనిఖీలు



ఆర్ఆర్‌పేటలోని నూకల రామకృష్ణ ఇల్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ఐటీ శాఖ అధికారుల సోదాలు మూడో రోజూ కొనసాగాయి. ఏలూరు నగరానికి చెందిన ఆయిల్‌ఫెడ్ వ్యాపారి నూకల రామకృష్ణ ఇల్లు, కంపెనీ కార్యాలయాల్లో ఆదాయ పన్ను అధికారులు తనిఖీలు చేపట్టారు. చెన్నై నుంచి వచ్చిన అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఏలూరు నగరంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం రాత్రి వరకు ఆదాయపు పన్ను రిటర్న్స్‌కు సంబంధించి వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయంలోని కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది.

మౌలిక వసతులు కనుమరుగు

- కాలనీల్లో ధ్వంసమైన రహదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రత్తిపాడు జగనన్న కాలనీ ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్న దృశ్యం

పెంటపాడు: పేదల ఆశలు నీరుగారిపోతున్నాయి. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం పోరాడిన నిరుపేదలకు ఇంటి స్థలం దక్కినా, కొంత మంది ఇళ్లు నిర్మించుకున్న కష్టాలు మాత్రం వెన్నంటి ఉన్నాయి. జగనన్న కాలనీలలో వైఎస్సార్ సీపీ హయంలో ఇళ్లు నిర్మించుకొన్న పేదలకు ఇంటి స్థలం దక్కినా ఎంతో సంతోషంగా గృహప్రవేశాలు చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో వారికి కష్టాలు ప్రారంభమయ్యాయి. సమస్యలు మాత్రం తీరడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు పైగా అవుతున్న కాలనీల గురించి పట్టించుకొనే నాథుడు లేడు. ప్రధానంగా పెంటపాడు మండలం ప్రత్తిపాడు భారీ లేఅవుట్‌లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కనీస అవసరాలు అయిన తాగునీరు, రోడ్ల సమస్యలను నివారించలేకపోతున్నారు. ఇటీవల వచ్చిన ఎమ్మెల్యేకు సమస్య విన్నవించుకొంటే ఒక 10 అడుగుల మేర కంకర రోడ్డు తప్ప ఇతర సమస్యలు తీర్చలేదన్నారు. కామన్ స్థలంలో పిచ్చిమొక్కలు తొలగించలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. సుమారు 700కు పైగా ఈ ప్రాంతంలో జగనన్న ఇళ్లు ఉన్నాయి. అయితే వీరికి సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా ప్రత్తిపాడులో సరైన రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగు నీటి కుళాయిల ద్వారా పురుగులు వస్తున్నాయని వాపోతున్నారు. కాలనీకి వస్తే పేదలు సమస్యలను ఏకరువు పెడుతున్నారు. దీనికి తోడు ఇటీవల పన్నులు కట్టాలని స్థానిక నాయకునితో పాటు, గ్రామ కార్యదర్శి తమకు నోటీసులు అందజేస్తున్నట్లు ప్రత్తిపాడు కాలనీ వాసులు వాపోతున్నారు. ఇంటిపై పూర్తిగా హక్కులు రావాలంటే ప్రభుత్వం విధించే పన్ను రూ. 3 వేలతో పాటు, అదనంగా సొమ్ములు చెల్లించుకోవాలని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. జగనన్న కాలనీలో కేవలం విద్యుత్ సౌకర్యం తప్ప డ్రెయినేజీలు లేవని, ఎటుచూసినా పిచ్చి మొక్కలతో అపారిశుద్ధ్యం నెలకొని ఉందన్నారు. రాత్రి సమయాలలో పాములు రోడ్లపై సంచరిస్తున్నాయన్నారు. ఇటీవల వృద్ధులు, వికలాంగులకు పింఛన్ అందజేసేందుకు గ్రామ సచివాలయ అధికారులు రావడం లేదని కాలనీకి చెందిన మానేపల్లి కృష్ణవేణి వాపోయారు. గ్రామ పంచాయతీకి సర్పంచ్‌తో పాటు, పాలకవర్గం లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. గ్రామానికి ఇన్‌చార్జిగా ఉన్న ఎంపీడీవో కాలనీలో పర్యటించిన దాఖలాలు లేవన్నారు. ప్రధానంగా డీఎల్‌పీవో ఇన్‌చార్జ్‌గా ఉన్న ఎంపీడీవో కనీస వసతులు కల్పించడంలో విఫలం చెందుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల వర్షాల సమయంలో పలుసార్లు అధికారులకు విన్నవించుకొన్న ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా పన్నుల విషయంలో కాలనీవాసులకు సరైన స్పష్టత ఇవ్వాలని కాలనీవాసులు చెబుతున్నారు.



కాలనీ సమస్యలు వివరిస్తున్న ప్రత్తిపాడు జగనన్న కాలనీ వాసులు

అధ్వానంగా రోడ్లు

ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండటంతో ట్రాక్టర్లు, లారీలు తిరగడం వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం కాలనీలోని అన్ని వీధి రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలతో వాహనచోదకులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. వర్షం వస్తే కాలనీవాసులు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మంచి నీటి సౌకర్యం లేదు. కాలనీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. కచ్చా డ్రెయిన్లు తవ్వించేనాథుడు లేడని కాలనీవాసులు వాపోతున్నారు.

రెండు నెలలుగా పింఛన్ అందడం లేదు



కాలనీలో సరైన సౌకర్యాలు లేవు. జగనన్న అందజేసిన ఇంటిలో నివాసం ఉంటున్నాం. అయితే ప్రతి నెలా ఠంచన్‌గా ఫించన్ అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత రెండు నెలలుగా నాకు పింఛన్ అందడం లేదు. అధికారులు కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలి.

– మానేపల్లి కృష్ణవేణి, వృద్ధురాలు, ప్రత్తిపాడు

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కాలనీలో డ్రెయినేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మౌలిక సదుపాయాలు కల్పించాలి. తక్షణం మండల అధికారులు సమస్యలను పరిష్కరించాలి. చెత్త రిక్షా ఇక్కడకు రావడంలేదు. కూటమి నాయకులు కాలనీలో సమస్యలపై వెంటనే స్పందించాలని కోరుతున్నాం.

– పెంద్ర దుర్గ, జగనన్న కాలనీవాసి

కాలనీ సమస్యలు పరిష్కరించండి



కాలనీలో సమస్యలను తక్షణమే అధికారులు పరిష్కరించాలని.ఒక్కో ఇంటికి రూ.మూడు వేలు పైగా పన్నుకట్టాలని నోటీసులు ఇచ్చారు. కాలనీలో సౌకర్యాలు మెరుగుపరచకుండా పన్నులు ఎలా కట్టగలం. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– మజ్జి కుమారి, స్థానికురాలు

వీరంపాలెం కేఎస్‌కేను సందర్శించిన విద్యార్థినులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని (ఆర్ఎస్‌కే)లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను విద్యార్థులు పరిశీలించారు. ధాన్యం అమ్మకాలు, ధర తదితర విషయాలను ఆర్ఎస్‌కే సిబ్బంది సాయిరామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీశ్వరి, ప్రీతి, అనూష, కుసుమ, హరిణి, జ్యోత్స్న, స్వప్న, జాన్ బీ తదితరులు ఉన్నారు.

12 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఈ నెల 12 తేదీ నుంచి అపార్ ఐడీ జనరేషన్‌కు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్ చేయుటకు అవసరమైన ఆధార్‌కార్డు డేటా సవరణలకు అన్ని మండలాల, మున్సిపాలిటీల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 90 ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆధార్ సెంటర్లలో నవంబర్ 12 నుంచి 28 వరకు 15 రోజుల పాటు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆచంట రూరల్ 2, ఆకివీడు 4, అత్తిలి రూరల్ 3, భీమవరం రూరల్ 6, భీమవరం అర్బన్ 4, యలమంచిలి 4, గణపవరం 4, ఇరగవరం రూరల్ 3, కాళ్ల 4, మొగల్తూరు 4, నరసాపురం అర్బన్ 4, నరసాపురం రూరల్ 3, పాలకొల్లు రూరల్ 4, పాలకొల్లు అర్బన్ 3, పాలకోడేరు 3, పెంటపాడు 2, పెనుగొండ 3, పెనుమంట్ర 3, పోడూరు 4, తాడేపల్లిగూడెం రూరల్ 4, తాడేపల్లిగూడెం అర్బన్ 4, తణుకు రూరల్ 2, తణుకు అర్బన్ 6, ఉండి 3, వీరవాసరం 4 ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రొక్కాల నాగబుజ్జి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ ప్రభుత్వ విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రొక్కాల నాగ బుజ్జి సిబ్బందికి సూచించారు. యాగర్లపల్లిలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం రొక్కాల నాగబుజ్జి సందర్శించారు. విద్యార్థుల సమస్యలను వార్డన్‌ను నయోమి రాణిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మద్యం బెల్టు షాపు నిర్వాహకురాలి అరెస్టు



మహిళను అరెస్టు చేసిన గూడెం ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్న ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. సదరు మహిళ వద్ద నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్ఐ రమాదేవి, మురళీమోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు వాటి సామర్థ్యం, ఉత్పాదకతలను కొత్త తరహా టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు నల్లగుండ్ల గాంధీ తెలిపారు. ఎక్కువ లాభాలు ఎలా ఆర్జించాలి అనే అంశాలపై శుక్రవారం పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఎంఎస్ఎంఈ జెడ్ఈడీ కాంపిటీటివ్ లీన్ స్కీంలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టేట్ వైస్ చైర్‌పర్సన్ ఉంగరాల నాగేశ్వరి, జిల్లా వైస్ చైర్మన్ పల్లెం గణపతిరావు, టీం సభ్యులు హేమంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన



బాలికల వసతి గృహంలో సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం

తణుకు టౌన్: న్యాయ సేవలపై విద్యార్థినీలకు అవగాహన అవసరమని జిల్లా నాల్గవ అదనపు జడ్జి, తణుకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డీ సత్యవతి చెప్పారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా తణుకులోని కళాశాల విద్యార్థినీల వసతి గృహంలో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినీలకు న్యాయ సేవల గురించి వివరించారు. బాల్య వివాహాల నివారణ, బాలికల పట్ల గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. వినియోగదారుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం పొందే పద్ధతుల గురించి వివరించారు. ముందుగా వసతి గృహంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు కే మునిస్వామి, కె వెంకటేశ్వర్లు, ముప్పిడి సుబ్బయ్య, అంగజాల అజయ్‌కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ కమల, విద్యార్థినీలు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

తణుకు టౌన్: విద్యార్థుల్లో సమయ పాలన, క్రమ శిక్షణలను పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడుతుందని స్టేట్ జాంబోరే 2024 సిల్వర్ జూబ్లీ స్టేట్ ఆర్గనైజింగ్ కమీషనర్ ఈ కోటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం తేతలి స్టెప్పింగ్‌స్టోన్స్ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే స్టేట్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాంబోరే 2024 సిల్వర్ జూబ్లీ ఉత్సవాల ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలందరికీ సత్వర న్యాయం అందాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరికి సత్వర న్యాయం అందాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ అన్నారు. బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయసేవల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా ఆదేశాలు మేరకు శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూర్యకిరణ్ శ్రీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్ తదితర న్యాయ విశేషాలను తెలిపారు. డిసెంబర్ 14వ తేదీన జరగబోవు నేషనల్ లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణి, బార్ వైస్ ప్రెసిడెంట్ కంకట శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ మాకా సత్యనారాయణ, న్యాయవాదులు ఎం.గోపాలరావు, ఈ.మేష్, కొప్పర్తి శ్రీనివాస్, లక్ష్మి, రత్నశేఖర్, శేఖర్‌బాబు, జి.శ్రీనివాసరావు, భద్రం, అప్పారావు, ప్రవీణ్ ప్రకాష్, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, కార్యదర్శి మందలపర్తి హరీష్, సంఘ అధ్యక్షుడు దువ్వ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలో కార్మిక సంఘ భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భీమవరంలో ఈ నెల 11వ తేదీన సోమవారం జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేన్నారు. సిమెంట్, ఐరన్ ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రానున్న రోజులలో భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఆయా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో కోడే సాయి బాలాజీ, అత్తిలి రెడ్డమ్మ, పంతం రామకృష్ణ బాలాజీ, శెట్టి సింహాచలం, ఉప్పులూరు మధు, టి.రమణ, కార్మికులు పాల్గొన్నారు.

చిన్న దోమైనా పెద్ద ముప్పే



తణుకులో ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: దోమ చిన్నదైనా దానివలన కలిగే ముప్పు తీవ్రంగా ఉంటుందని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఎన్జీవో కాలనీ, ఇంద్రయ్య నగర్ వార్డు ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ, ఫీవర్ సర్వే కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. దోమల ద్వారా సంక్రమించే మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, జపాన్ ఎన్సెఫలైటిస్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రజలంతా ఖర్చురహితమైన వారానికోసారి డ్రైడే ఇంటి లోపల, బయట పాటించాలని కోరారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉన్నందున నీరు నిలబడే నిరుపయోగ సామాగ్రిని తొలగింపజేసుకోవాలని సూచించారు. అనంతరం ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎం ఎం.పద్మావతి, వార్డు హెల్త్ సెక్రటరీలు కె.ప్రసన్న రాణి, విజరాజకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్తలు ఎ.అనూరాధ, టి.లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ సత్య ఉషారాణి

తణుకు టౌన్: ఈనెల 27న కర్ణాటకలో జరిగే సౌత్ జోన్ మహిళా బ్యాడ్మింటన్ పోటీలకు తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినీలు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. ఈనెల 7వ తేదీన పాలకొల్లు డీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మహిళా బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలలో తమ విద్యార్థినీలు బీ రేణు శ్రీ,, యంఎస్‌డీ భవానీ, బీ నాగలక్ష్మి దుర్గ, ఎం రాణీ ఖ్యాతిశ్రీ పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. వారిలో బీ రేణు శ్రీ,, యూఎన్ భవానీలు సౌత్ జోన్, ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, పీడీ ఎం రత్నకుమారి, తదితరులు అభినందించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

తాడేపల్లిగూడెం: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని నన్నయ్య ప్రాంగణ ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. ప్రాంగణంలోని మహిళా హస్టల్ తొలి వార్షికోత్సవ వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తోటి విద్యార్థులతో కలిసిమెలిసి ఉండటం, సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హాస్టల్ డిప్యూటీ వార్డెన్ డాక్టర్ ఎస్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో ఎక్సైజ్ దాడులు

పెంటపాడు: మండలం దర్శిపర్రు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పెంటపాడు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కత్తుల రవి అక్రమంగా మద్యం నిల్వచేసి అమ్ముకోవడంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. 34 మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

దివ్యాంగులను ప్రత్యేక పిల్లలుగా చూడవద్దు



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను ప్రత్యేక పిల్లలుగా చూడవద్దని, మనలో ఒకరుగా భావించి నార్మల్ పిల్లతో సమానంగా చూడాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని భవిత దివ్యాంగుల కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల పిల్లలకు ప్రతి రోజు ఇంటి వద్ద నేర్పించాల్సిన నైపుణ్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం జరిగింది. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల నైపుణ్యాలపై తర్ఫీదు పొంది వారి అభివృద్ధికి కృషి చేయాలని సూచనలు చేశారు. అలవెన్సులు, ఉపకరణాలు, దివ్యాంగులకు ఉద్యోగాలు, రాయితీలు అందిస్తున్నట్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయ ఎం.చంద్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

ఆకివీడు: దేశానికి భవిష్యత్ పౌరులు బాలలేనని, వారిని స్వేచ్ఛగా ఎదగనివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, డీసీపీయూ సీహెచ్ విజయ సత్య అన్నారు. స్థానిక సరోజినీనాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, దుంపగడపలోని జెడ్పీ స్కూల్‌లో శుక్రవారం బాలల హక్కులు, సంరక్షణ చట్టాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. ఆకతాయిల వేధింపులకు గురైన, అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తించినా, దాడులు చేసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోక్సో చట్టం ద్వారా వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాల ప్రజా ప్రతినిధులు ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఏకతాటి మీదకు రావాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ప్రశ్నించాలని మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో శుక్రవారం మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ మాలలు ప్రజా ప్రతినిధులు, మాల నాయకులు, మాలలు వర్గీకరణను అడ్డుకోకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతామని చెప్పారు. మాల ప్రజా ప్రతినిధులు జాతి కోసం పనిచేయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేస్తానని చెప్పడం, సుప్రీం కోర్టు చేసుకోవచ్చునని తీర్పు నివ్వడం అందరికి తెలిసిన విషయమే అన్నారు. వర్గీకరణ చేస్తే జాతి నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును మాదిగలు కలిసి వర్గీకరణపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారని, చంద్రబాబు స్పందించారని, త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పడం గుర్తించాలన్నారు. మాల ప్రజా ప్రతినిధులు మన జాతికి జరుగుతున్న నష్టంపై ముఖ్యమంత్రిని నిలదీయాలని, పదవులు కావాలి తప్ప జాతి అవసరం లేదా అని ప్రశ్నించారు. మాలలను ఒకే తాటిపైకి తెచ్చి రానున్న రోజుల్లో మాలల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. గుంటూరులో జరిగే మాలల గర్జనలో పాల్గొని సత్తా చూపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకులు బేతాళ శరత్‌బాబు, చొడదాసి జైపాల్, విజయ్ ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ధరలు అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 8 నుంచి 14 వరకు ఇచ్చిన ప్రజాపోరు ప్రారంభం నేపథ్యంలో అమరవీరుల భవనం నుంచి శుక్రవారం ఇంటింటికీ ప్రదర్శన నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడి అయిదు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రజలపై భారాలు మోపడం ఆపలేదన్నారు. ధరలు పెరుగుతున్న విధంగా ప్రజల ఆదాయాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 14న ధరలు తగ్గించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గార రంగారావు, పి.గణేష్, జన్యాల బంగారమ్మ, ఉష, శ్రీను, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు

అత్తిలి: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కంచుమర్రు సర్పంచ్ పెన్మెత్స రామకృష్ణంరాజు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం అత్తిలి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ కృష్ణంరాజు మాట్లాడుతూ పంటకాలువ వెంబడి ఉన్న దుకాణదారులు కాలువలో చెత్త వ్యర్థ పదార్థాలను వేయడం ద్వారా నీటిపారుదలకు ఆటంకం ఏర్పడంతో పాటు నీరు కలుషితం అవుతోందన్నారు. కాలువ వెంబడి దుకాణాలు లేకుండా చూడాలని, డ్రెయినేజీ వ్యవస్థ పటిష్ట పర్చాలన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్‌కాకపోవడంతో గృహనిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఆఫ్‌లైన్‌లో ఇసుక తెచ్చుకునేవిధంగా చూడాలని హౌసింగ్ ఏఈ, తహసీల్దార్ దశికవంశీని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి శామ్యూల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు కోసం 7,962 దరఖాస్తులు

తణుకు టౌన్: పట్టభద్రుల ఓటు హక్కు కోసం తణుకు మండలంలో మొత్తం 7,982 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మ తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితా తయారీలో బాగం పట్టభద్రుల నుంచి ఈనెల 6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో 3,015 దరఖాస్తులు, ఆఫ్‌లైన్‌లో 4 వేల 967 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను పోలింగ్ బూత్‌ల వారీకి విభజించి బీఎల్ఓల ద్వారా గ్రామాల్లోని పోలింగ్ బూత్ స్థాయిలో విచారణ చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా తణుకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను పోలింగ్ బూత్‌ల ,వారీగా బీఎల్‌వోలు విభజించారు. వీటి ఆధారంగా బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో విచారణ ప్రారంభిస్తారని తెలిపారు.

ఉన్నత లక్ష్యాల కోసం ప్రణాళికలు రచించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉన్నత లక్ష్యాలు కోసం విద్యార్థులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం రాజేంద్ర ప్రసాద్ 8, 9, 10 తరగతుల పిల్లలకు ఎడ్యుకేషన్ ఉపయోగాలు, సెల్‌ఫోన్ దుర్వినియోగం, ఆడ పిల్లలు ఎలా ఉండాలి, మగ పిల్లలకు ఎటువంటి బాధ్యతలు కలిగి ఉన్నారనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, టౌన్ ఎస్ఐ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గ భావానీ, కె.విశాలక్ష్మి, స్కూల్ హెచ్ఎం మైనం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.